'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

సభలో పొగలు-సెగలు

పార్లమెంటులో రంగు పొగల దాడి సెగలు పుట్టిస్తున్నది. దాడి చేసిన వారి ఉద్దేశం ఏమైనప్పటికీ జరిగింది భద్రతా వైఫల్యం అనేది అందరూ అంగీకరించే విషయమే. ఆగంతకులు సభలోకి ప్రవేశించి వీరంగం వేయడం చూసి దేశం నివ్వెరపోయింది. కానీ, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచీ తేలిక చేసి మాట్లాడటం అంతకన్నా ఎక్కువ విస్మయాన్ని కలిగించింది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు కీలక ఘటనలపై మంత్రులు ప్రకటనలు చేయడం సంప్రదాయం. ఇక్కడ ఘటన జరిగింది పార్లమెంటు లోపలే. భద్రతా వైఫల్యం వల్ల తీవ్ర ఉత్కంఠ నెలకొన్న ఉదంతంపై ప్రభుత్వం లేదా హోంమంత్రి సభలో నోరు విప్పకపోవడం ఏమిటనేది ఇక్కడ ప్రశ్న. కేంద్ర పెద్దలు ఈ అంశంపై పార్లమెంటు వెలుపల మాట్లాడారు కానీ సభా వేదికగా స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. అదో పెద్ద విషయమే కాదన్నట్టు బీజేపీ నేతలు ప్రకటనలు చేయడం తెలిసిందే. ప్రధాని మోదీ చాలా ఆలస్యంగా స్పందిస్తూ తీవ్రమైన ఉల్లంఘనే అని అంగీకరిస్తూనే దీనిపై రాద్ధాంతం అనవసరమని అనడం గమనార్హం. పనిలో పనిగా ఆయన విపక్షాలపై విమర్శలు కూడా చేశారు. హోంమంత్రి అమిత్ షా ఓ టీవీ ఇంటర్వ్యూలో ఈ అంశంపై యథాలాపంగా మాట్లాడారు తప్ప సభలో ఎలాంటి ప్రకటన చేయలేదు.

తీవ్రంగా పరిగణించాల్సిన అంశంపై ప్రభుత్వం సభలో ప్రకటన చేయాల్సిందేనని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అందుకు ససేమిరా అంటున్నది. దాంతో విపక్షాలు సభలో ఆందోళనకు దిగుతున్నాయి. దీనివల్ల పార్లమెంటులో నిత్యం గలభా జరిగి ప్రతిష్టంభన ఏర్పడుతున్నది. వాయిదాల మీద వాయిదాలతో సభా సమయం వృథా అవుతున్నది. పార్లమెంటు ఉభయసభల నుంచి విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం నిత్యకృత్యమైపోయింది. ఈ సెషన్‌లో ఇప్పటి వరకు ఉభయసభల్లో ఈ అంశంపై సస్పెండైన సభ్యుల సంఖ్య 141కు చేరుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఇదొక రికార్డు అంటున్నారు. కాగా ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి పార్లమెంటు అట్టుడుకుతూనే ఉన్నది. మరికొందరు విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసినట్టు వార్తలు వెలువడుతున్నాయి. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్నదని విపక్షాలు ఆరోపిస్తుండగా, విపక్షాలు క్రమశిక్షణారాహిత్యంతో వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రులు విమర్శిస్తున్నారు.

పార్లమెంటుపై నాటకీయంగా దాడి జరిపిన నిరసనకారులపై 'ఉపా' వంటి కఠిన చట్టాన్ని ప్రయోగిస్తున్న ప్రభుత్వం చర్చకు ఎందుకు జంకుతున్నదో తెలియడం లేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి చర్చే ప్రాణాధారం. ప్రజాసమస్యలు చర్చించాల్సిన అత్యున్నత వేదిక అయిన పార్లమెంటులో చర్చ లేకుండానే బిల్లులు పాసవుతుండటం చూస్తున్నాం. చర్చను డిమాండ్ చేస్తున్న విపక్షాలను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రపంచానికి తప్పుడు సంకేతాలు పంపించినట్టు అవుతున్నది. అతిపెద్ద ప్రజాస్వామ్యంగా కీర్తిప్రతిష్ఠలు పొందిన భారత్‌కు ఇది అంతగా శోభించదు.

నాడు అపచారం.. నేడు విష ప్రచారం

'మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అంత్యక్రియలు ఢిల్లీలో నిర్వహించడానికి కాంగ్రెస్ పెద్దలు అంగీకరించలేదు. కనీసం ఆయనకు ఘాట్ ఏర్పాటుచేయడానికి ఢిల్లీలో గజం జాగ ఇవ్వకుండా అవమానించింది కాంగ్రెస్ కాదా?' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అసెంబ్లీలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి స్పందిస్తూ 'పీవీ అంత్యక్రియలు హైదరాబాద్‌లో నిర్వహించాలని ఆయన కుటుంబసభ్యులే కోరారు. దీంట్లో కాంగ్రెస్ తప్పేమీ లేదు' అని సమర్థించుకోజూశారు. పీవీ అంత్యక్రియల విషయంలో హరీశ్‌రావు ఆరోపణ వాస్తవమా? లేక జీవన్‌రెడ్డి వాదన నిజమా?. ఇందులో ఏది నిజం? ఏది అబద్ధం? వాస్తవాన్ని నిగ్గుతేల్చే వ్యాసం ఇది. పీవీ నరసింహారావు రాజకీయ ప్రస్థానంపై ఈ వ్యాసకర్త రాసిన 'వేయిపడగల మేధావి' పుస్తకంలో అప్పటి ఉదంతాన్ని వివరించారు.

వెల్జాల చంద్రశేఖర్
98499 98092

అంత్యక్రియలపై... అసలేం జరిగింది?

ఆ రోజు డిసెంబర్ 23, 2004. ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ పీవీ నరసింహారావు తుదిశ్వాస విడిచారు. పీవీ మరణవార్త తెలియగానే అనంతపురం పర్యటనలో ఉన్న సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరారు. పీవీ పార్థివదేహానికి నివాళులర్పించడానికి వచ్చిన ప్రధాని మన్మోహన్ సింగ్, హోంమంత్రి శివరాజ్ పాటిల్, గులాంనబీ ఆజాద్, అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలని అనుకుంటున్నారని పీవీ కుమారుడు ప్రభాకర్‌రావును ఆరా తీశారు. నాన్న చివరి కోరిక మేరకు ఢిల్లీలోనే నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఇక్కడి కంటే హైదరాబాద్‌లో అయితే బెటర్... ఇక్కడి (ఢిల్లీ) వరకు ఎవరు వస్తారు, అక్కడికైతే అందరూ వస్తారని వారు సూచించారు.

'ఇది నా ఒక్కడి నిర్ణయం కాదు, మా కుటుంబమంతా ఢిల్లీలోనే నిర్వహించాలి' అని అంటున్నారని ప్రభాకర్‌రావు గుర్తుచేశారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన కాంగ్రెస్ పెద్దలు సీఎం వైఎస్ ఎక్కడ ఉన్నారని ఆరా తీశారు. అనంతపురం నుంచి ఢిల్లీకి వస్తున్నట్టు సమాచారం ఇచ్చారు. 'త్వరగా వచ్చేయండి... పీవీ అంత్యక్రియలు హైదరాబాద్‌లో జరిగేలా వారి కుటుంబసభ్యులను ఒప్పించాలి' అని ప్రభాకర్‌రావుతో జరిగిన సంభాషణను వారు వివరించారు.

కాంగ్రెస్ పెద్దల అభిప్రాయం వైఎస్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశంగా అర్థమైంది. ఆ మరుక్షణం వైఎస్ కేంద్ర మంత్రి వెంకటస్వామికి ఫోన్ చేసి పీవీ కుమారుడు ప్రభాకర్‌రావుతో మాట్లాడించమని కోరారు. అంత్యక్రియల నిర్వహణపై పార్టీ పెద్దలకు చెప్పిందే ఆయన వైఎస్‌కూ చెప్పారు. 'ప్రభాకర్ తొందరపడవద్దు నేను కాసేపట్లో ఢిల్లీకి వస్తున్నా, వచ్చాక మాట్లాడుకుందాం' అని వైఎస్ అన్నారు. సాయంత్రం 7 గంటలకు ఢిల్లీకి చేరుకున్న వైఎస్ నేరుగా పీవీ ఇంటికి వచ్చారు. ప్రభాకర్‌రావును పక్కకు తీసుకెళ్లి అంత్యక్రియల ప్రస్తావన మళ్లీ తీసుకువచ్చారు. ఢిల్లీలోనే అంత్యక్రియలు జరగాలనే తమ తండ్రి చివరి కోరిక అని ఆయన మరోసారి గుర్తుచేశారు.

'ఇదిగో ప్రభాకర్, ఇక్కడికి ఎవరొస్తారు, హైదరాబాద్‌లో అయితే నాన్న అభిమానులు, మనవాళ్లంతా (కార్యకర్తలు, నాయకులు) వస్తారు. అక్కడ మన ప్రభుత్వం ఉంది. అంత్యక్రియలు చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిద్దాం, నా మాట విను' అని అన్నారు. అయినా ప్రభాకర్‌రావు ఏ మాత్రం మెత్తబడలేదు. దీంతో అక్కడినుంచి వైఎస్ వెళ్లిపోయారు. అదేరోజు రాత్రి రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలను తన ఇంట్లో జరిగే సమావేశానికి రావాల్సిందిగా హోంమంత్రి శివరాజ్ పాటిల్ ఆహ్వానించారు. రాత్రి పది, పదిన్నర గంటలకల్లా వైఎస్‌తో పాటు కేంద్ర మంత్రులు, రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా శివరాజ్ పాటిల్ ఇంటికి చేరుకున్నారు.

అప్పుడు కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా ఉన్న టీఆర్ఎస్‌కు కూడా ఆహ్వానం అందడంతో హన్మకొండ ఎంపీ బోయిన పల్లి వినోద్‌కుమార్ కూడా ఆ సమావేశానికి హాజరయ్యారు. అప్పుడు ఢిల్లీలో ఎముకలు కొరికే చలి. అయినప్పటికీ పార్టీ అగ్రనేతల నుంచి పిలుపు కావడంతో అందరూ హాజరయ్యారు. అగ్రనేతలు ప్రణబ్ ముఖర్జీ, గులాంనబీ ఆజాద్, అహ్మద్ పటేల్ కూడా రాగానే.. 'ఇక మొదలుపెట్టండని' శివరాజ్ పాటిల్ సూచించారు. 'అంత్యక్రియలు ఢిల్లీలో కాకుండా హైదరాబాద్‌లో నిర్వహించడం సమంజసంగా ఉంటుంది' అని వైఎస్ చర్చ ప్రారంభించారు. వైఎస్ ప్రతిపాదనపై ఎవరూ నోరు మెదపలేదు. వారి మౌనం అంగీకారంగా వైఎస్ భావించారు. పార్టీ అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చే ఎంపీలతో 'మమ' అనిపించడానికే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు అక్కడికి వచ్చినవారికి అర్థమైంది. పీవీ కుటుంబసభ్యుల నిర్ణయాన్ని పక్కనపెట్టి కాంగ్రెస్ పెద్దలు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ఏంటని ఎంపీ వినోద్‌కుమార్ ఆశ్చర్యానికి గురయ్యారు. పీవీ కుటుంబం తరపున ఆ సమావేశానికి వచ్చిన కరీంనగర్ జిల్లాకు చెందిన కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎర్రబాటి భాస్కర్‌రావు కూడా కాంగ్రెస్ పెద్దల మనసులో ఏముందో అర్థం కావడంతో మౌనంగా ఉండిపోయారు.

ఒక మాజీ ప్రధానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం అనేది ప్రొటోకాల్. ఏ పార్టీ ప్రభుత్వం అయినా దానిని పాటించాల్సిందే. పీవీ పట్ల కాంగ్రెస్ పార్టీకి అపారమైన గౌరవమే ఉంటే ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా ఎందుకు నిర్వహించలేదన్నది ప్రశ్న.

'మేము (పీవీ కుటుంబ సభ్యులం) 30 మంది ఉన్నాం, హైదరాబాద్ వెళ్లడానికి ఒక చార్టర్ ఏర్పాటు చేయండి' అని భాస్కర్‌రావు అడిగారు. 'అదేమంత పని.. అలాగే చేద్దాం' అని శివరాజ్ పాటిల్ అన్నారు. అంత్యక్రియలు హైదరాబాద్‌లో జరిగేలా ఒప్పించడం అవుతుందా? కాదా? అని శివరాజ్ పాటిల్ ఎంత టెన్షన్ పడ్డారో? ఆ ఒత్తిడికి కారణం ఎవరు?

గాంధీభవన్ ట్రస్టుకు చైర్మన్ కూడా అయిన పీవీ భౌతికకాయాన్ని చూడటానికి గాంధీభవన్ కూడా నోచుకోలేకపోయింది. ప్రజల సందర్శనార్థం పీవీ భౌతికకాయాన్ని గాంధీభవన్‌లో ఉంచుతామని ఢిల్లీలో శివరాజ్ పాటిల్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రకటించినప్పటికీ, గాంధీభవన్‌కు పీవీ భౌతికకాయాన్ని తరలించడానికి అనుకోని అవాంతరాలు అడ్డు వచ్చాయి. పీవీ మరణం తర్వాత కాంగ్రెస్ ఆయనను అవమానించిన తీరు ఎందరినో కలచివేసింది. ఒక పథకం ప్రకారమే ఢిల్లీలో పీవీ అంత్యక్రియలు జరగనీయలేదన్నది పీవీ కుటుంబసభ్యుల ఆరోపణ. దీని వెనుక పెద్ద హైడ్రామానే నడిచినట్టు వారు భావిస్తున్నారు.

పీవీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగౌరవపరచలేదని, అధికార లాంఛనాలతోనే అంత్యక్రియలు నిర్వహించామని కాంగ్రెస్ నేతలు వాదించారు. ఒక మాజీ ప్రధానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం అనేది ప్రొటోకాల్. ఏ పార్టీ ప్రభుత్వం అయినా దానిని పాటించాల్సిందే. పీవీ పట్ల కాంగ్రెస్ పార్టీకి అపారమైన గౌరవమే ఉంటే ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా ఎందుకు నిర్వహించలేదన్నది ప్రశ్న.

పీవీ మరణించిన తర్వాత దశాబ్దకాలం పాటు కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే ఉండి కూడా అన్ని పార్టీలు పీవీకి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేసినా పట్టించుకోకపోవడమూ మరో తప్పిదం. ఇప్పటివరకు భారతరత్న పొందినవారి కంటే పీవీకి ఉన్న యోగ్యతలు ఎక్కువే కానీ తక్కువేమీ కాదన్నది జగమెరిగిన సత్యం. ఇక్కడ ఒక్కటి మాత్రం నిజం. పీవీ పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరు, చేసిన తప్పులు ఆ పార్టీకి చరిత్రలో ఎప్పటికీ మాయని మచ్చగానే మిగిలిపోతాయి.

సింధూ నాగరికత చిక్కుముడి వీడేనా?

ప్రాచీన భారత చరిత్ర చిక్కుముడి విప్పలేని పొడుపు కథలా చరిత్రకారులను ఊరిస్తున్నది. నిగూఢ రహస్యంగా పరస్పర విరుద్ధ కథనాలు ఇప్పటికీ వినిపిస్తుంటాయి. ఆర్యులు భారతదేశ మూలవాసులు కారనీ మ్యాక్స్ ముల్లర్ తదితర పాశ్చాత్య చరిత్రకారులు చెప్తుంటారు. మధ్య ఆసియాలోని ఖజకిస్థాన్ ప్రాంతం నుంచి క్రీస్తు పూర్వం 1600 సంవత్సరంలో ఆర్యులు మన దేశానికి వచ్చి సింధూ నాగరికతను ధ్వంసం చేశారని ముల్లర్ వ్యాఖ్యానించారు. మొఘలులు, బ్రిటిష్ వారు కూడా ఆర్యుల మాదిరిగానే వచ్చి భారతీయులకు నాగరికతను నేర్పించారని బ్రిటిష్ సామ్రాజ్యవాద చరిత్రకారులు ప్రచారం చేశారు.

ఆనందేశి నాగరాజు
98488 38323

బాలగంగాధర్ తిలక్, శ్రీఅరవిందుడు, అంబేద్కర్ వంటి జాతీయవాదులు సింధూ నాగరికత ఆర్య దురాక్రమణ సిద్ధాంతం తప్పని చెప్పారు. మార్క్సిస్ట్ చరిత్రకారులు ఆర్యుల ఆక్రమణ సిద్ధాంతాన్ని సమర్థించి దాన్ని వర్గ పోరాటాల చరిత్రగా కుదించివేశారు. చరిత్ర అంటే గతంలో ఏం జరిగి ఉంటుందో అని మనం ఊహించుకునేది కాదు. గతంలో వాస్తవంగా ఏం జరిగిందో వైజ్ఞానికంగా నిర్ధారించుకొన్నదే అసలైన చరిత్ర. దానికి అనవసర గొప్పలు, లేని లొసుగులు ఆపాదిస్తూ తమ సైద్ధాంతిక చత్వారాన్ని అంటగట్టడం తప్పు.

ప్రముఖ ఫ్రెంచ్ రచయిత, చరిత్రకారుడు ఫ్రాన్స్వా గోటే రచించిన 'ఆన్ ఎంటైర్లీ న్యూ హిస్టరీ ఆఫ్ ఇండియా' గ్రంథంలో నూతన శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణల ఆధారంగా సింధూ నాగరికతపై స్పష్టత ఇచ్చారు. పారిస్‌లో జన్మించిన ఫ్రాన్స్వా గోటే ప్రముఖ ఫ్రెంచ్ దినపత్రిక లె ఫిగారో దక్షిణ ఆసియా విలేకరిగా పని చేశారు.

బ్రిటిష్ పురాతత్వ పరిశోధకుడు అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ 1853లో హరప్పా ప్రాంతంలో తవ్వకాలు జరిపి సింధూ నాగరికతను వెలుగులోకి తీసుకొచ్చారు. 1920లో జాన్ మార్షల్ ఈ పరిశోధనలు చేపట్టగా, తర్వాత వాటిని భారతీయ పురాతత్వ పరిశోధకులు బీబీ లాల్ తదితరులు కొనసాగించారు. ఇటీవల సింధూ నది నుంచి గుజరాత్ వరకు ఈ నాగరికతకు చెందిన నూటికి పైగా పురాతన కట్టడాలు, అవశేషాలను కనుగొన్నారు. అమెరికన్ ఆర్కియాలజిస్టు గ్రెగొరీ ఎల్ పాసెల్ సుమారు 2,600 పురాతన హరప్పా ఆవాసాలను, పురాతన నగరాలు, పట్టణాలు, ఆరాధన, వాణిజ్య వస్తువులను వెలికితీశారు. సింధూ నాగరికత పది లక్షల కిలోమీటర్ల కన్నా ఎక్కువ విస్తీర్ణంలో వ్యాపించి ఉండేదని ఒక అంచనా. ఈ నాగరికత విస్తీర్ణం ప్రాచీన మెసొపొటేమియన్, ఈజిప్టు నాగరికత మొత్తం విస్తీర్ణం కంటే ఎక్కువ. ఫ్రెంచ్ ఆర్కియాలజిస్టు జీన్ ఫ్రాన్స్వా జారిజ్ క్రీస్తు పూర్వం 7,000 కాలానికి చెందిన హరప్పా ఆవాసాలను కనుగొన్నారు. ఈ నాగరికత ప్రదేశ విస్తృతిని దృష్టిలో ఉంచుకొని దీనిని సింధూ సరస్వతి నాగరికతగా పిలవడం సమంజసమని సింధూ నాగరికతపై నిపుణుడైన ప్రముఖ పాకిస్థాన్ ఆర్కియాలజిస్టు ప్రొఫెసర్ అహ్మద్ హసన్ డానీ అభిప్రాయపడ్డారు. ప్రాచీన కాలంలో సరస్వతి, సింధూ నదులు సుమారు 300 కిలోమీటర్ల పొడవున ప్రవహించేవి. సింధూ నాగరికత ప్రస్తుత హర్యానా, రాజస్థాన్ వరకు విస్తరించి ఉన్నది. వేదాలు, ఇతిహాసాలలో సైతం సరస్వతి నది ప్రస్తావన ఉన్నది. నదీ ప్రవాహ గతిని మార్చుకున్న వైనాన్ని వాటిలో వివరించారు. ఆధునిక ఉపగ్రహ చిత్రాలు సైతం సరస్వతి నది పుట్టుక, అంతరించిన విధానాన్ని రుజువు చేశాయని ఫ్రాన్స్వా గోటే అంటారు.

సింధూ సరస్వతి నాగరికతలోని పశుపతి (శివుని) ముద్రికలు, మాతృమూర్తులు, యోని పూజలు, స్వస్తిక, యోగాసనాల ముద్రలు, అగ్నిగుండాల అవశేషాలు పరిశీలిస్తే ఇప్పటికీ మనదేశంలో అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న హిందూ పూజా విధానాలు గుర్తుకువస్తాయి. ఆనాటి గాజులు ధరించే విధానం, సింధూరం దిద్దుకునే పద్ధతి, చేతులు జోడించి నమస్కరించే విధానం, చదరంగం, వైకుంఠపాళి వంటి ఆటలు ఈ నాటికీ మన దేశంలో ప్రాచుర్యంలో ఉన్నాయి. హరప్పా, మొహెంజొదారో వాసుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రస్తుతం హిందువులు పాటించే సంప్రదాయాల కంటే భిన్నమైనవని చెప్పలేమని మొహెంజొదారో ఆర్కియాలజీ నిపుణుడు మార్షల్ వ్యాఖ్యానించారు.

వేదాలు, ఇతిహాసాలలో ఆర్యుల ఆక్రమణల ప్రస్తావన లేదు. ఆర్యుల ఆక్రమణ సిద్ధాంతం మిథ్య అంటూ అమెరికన్ ఆర్కియాలజీ నిపుణుడు జార్జ్ ఎఫ్ డేల్స్ తీర్మానించారు. మొహెంజొదారో నాగరికత అంత్యదశలో సైతం ఎక్కడా విధ్వంసం, యుద్ధాల ఆనవాళ్లు లేవు. హరప్పా, మొహెంజొదారోల్లో విస్తృతమైన తవ్వకాలు జరిపినప్పటికీ ఎక్కడా సైనికులు, యుద్ధ సంబంధిత ఆనవాళ్లు కనిపించలేదు.

అందువల్ల ఈ ప్రాంతాల్లో ఆర్యులు దురాక్రమణ చేసి వారి నాగరికతను ధ్వంసం చేశారని చెప్పడానికి రవ్వంత రుజువులు లేవని డేల్స్ స్పష్టం చేశారు. ఫ్రెంచ్ ఆర్కియాలజిస్ట్ జీన్ మారీ కసల్ ఆర్యుల ఆక్రమణ సిద్ధాంతాన్ని ఖండించారు. ప్రత్యేక ఆర్య జాతి ఉందని చెప్పడానికి తార్కాణాలు లేవని ఆయన చెప్పారు. హరప్పాలో లభించే వస్తువులు, ఆయుధాలకు భిన్నమైనవి ఎక్కడా లభించలేదని స్పష్టం చేశారు.

మొహెంజొదారో తవ్వకాలలో లభించిన అస్థికలపై ప్రముఖ మానవ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్ఆర్ వాలింబ్ జరిపిన జన్యు పరిశోధనల్లో ఆర్య, సింధూ నాగరికుల మధ్య ఎలాంటి జన్యుపరమైన తేడాలు లేవని తేలింది. అలనాటి హరప్పా వాసులు, ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న ప్రజల జన్యు వారసత్వం అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నదని స్పష్టమైంది.



ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు

నిద్రమాత్రలు వేసుకుందాం!

కేంద్ర ప్రభుత్వం విపక్ష ఎంపీలందరినీ బయటకు తరుముతున్నది. కానీ, భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన ఆగంతకులకు పాస్‌లు జారీ చేసిన ఎంపీపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రజాస్వామ్యానికి శ్మశానవాటికగా మారుద్దామనుకుంటున్నదా? విపక్ష ఎంపీలందరూ.. నిద్రమాత్రలు వేసుకొని రండి. ఎందుకంటే మనకు నోరు తెరిచి ప్రశ్నలడిగే హక్కు లేదు కాబట్టి.

- హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, ఎంపీ

సాధు సంతుల పురిటిగడ్డ అయిన మహారాష్ట్రలో గొప్ప సంస్కర్తగా పేరు పొందిన వ్యక్తి సంత్ గాడ్గే బాబా. మహాత్మా జ్యోతిబా పూలే తర్వాత మహారాష్ట్రపై అత్యంత ప్రభావం చూపిన సంఘసంస్కర్త ఆయన. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురూజీ అని ప్రేమగా పిలుచుకున్న సామాజిక కార్యకర్త గాడ్గే బాబా.

స్వచ్ఛత ప్రవక్త, సంఘ సంస్కర్త

నేడు గాడ్గే బాబా వర్ధంతి

మహారాష్ట్ర సమాజంపై సంత్ గాడ్గే సామాజిక బోధనల ప్రభావం చాలా ఉన్నది. గాడ్గే బాబా కార్యకలాపాలకు, వ్యక్తిత్వానికి, భావజాలానికి ముగ్ధులై బీఆర్ అంబేద్కర్ ఆయనను గురువుగా సంబోధించేవారు. అంబేద్కర్ మతం మార్చుకుందామని భావిస్తున్న సమయంలో తాను అభిమానించే గాడ్గే బాబాను సలహా కోరారు. 'నేను చదువుకున్నవాడిని కాను, నీవే ధర్మాల మర్మాలు ఆలోచించగలిగిన వాడివి. నిన్ను లక్షల మంది అనుసరిస్తారు కాబట్టి హిందూ మతానికి హాని కలగకుండా మాత్రం చూడు' అని సలహా ఇచ్చారు సంత్ గాడ్గే బాబా.

మహాత్మాగాంధీ సైతం సంత్ గాడ్గే భావాలకు, ఆచరణకు ముగ్ధుడై బాబాను సందర్శించాలని భావించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు బీజీ ఖేర్ స్వాతంత్ర్యోద్యమ కాలంలో మహారాష్ట్రలో పర్యటిస్తున్న మహాత్మా గాంధీకి గాడ్గే కార్యకలాపాల గురించి వివరించగా ఆయనను కలవాలన్న కోరిక వ్యక్తపరిచారు. కొన్నేండ్ల తర్వాత గాడ్గే బాబా గాంధీజీ సేవాశ్రమానికి దగ్గరలోని వార్ధాకు విచ్చేసిన సమయంలో వారిని తన ఆశ్రమానికి ఆహ్వానించి కలిశారు. గాంధీజీని కలిసినప్పుడు వారిద్దరూ సమాజంలోని అవిద్యను, అంటరానితనాన్ని, దుర్వ్యసనాలను రూపుమాపడం వంటి విషయాలపై చర్చించారు. అలానే అప్పటికే గాడ్గే బాబా ఆయా విషయాల్లో చేసిన విశేషమైన కృషిని తెలుసుకున్న గాంధీ ఆయనను అభినందించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీజీ ఖేర్, నెహ్రూ మంత్రివర్గంలో పనిచేసిన పంజాబ్ రావు, బాబూరావ్ పాటిల్, ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ జీడీ తాపసే, పాత్రికేయులు అనంత్ హరిగద్రే, ప్రబోధాంకర్ ఠాక్రే, మరాఠీ రచయిత పీకే ఆత్రే, జీఎన్ దండేకర్ సహా ఎందరో ప్రముఖులు ఆయన శిష్యులు. వారందరూ ఆయన ప్రారంభించిన చీపురు దండులో సభ్యులుగా పనిచేసిన వారే.

దేశంలోని పలు రాజకీయపక్షాలూ, సేవాసంస్థలు సంత్‌గాడ్గే బాబాను స్ఫూర్తిగా తీసుకోవడం వెనుక గల ప్రధాన కారణమేమంటే.. ఆయన సుప్రఖ్యాతుడైన సాధువు, సంఘసంస్కర్త. సంచార భిక్షువు. గాడ్గే బాబా మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన అంజన్గావ్ తాలూకాకు చెందిన షేన్గావ్ గ్రామంలోని రజక కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు జింగ్రాజీ-స్కుబాయి. వారు రజక కులంలో జన్మించినా తండ్రితాత కాలం నుంచే ఉన్న భూమిని సాగుచేసుకుంటూ జీవించేవారు.

దేబూజీ తన 29వ ఏట 1904, ఫిబ్రవరి 5న కుటుంబాన్ని అర్ధరాత్రి వేళ విడిచిపెట్టి వెళ్లిపోయారు. అనంతరకాలంలో ఆయన సన్యాసం స్వీకరించి గాడ్గే బాబాగా సుప్రసిద్ధులయ్యారు. దేబూజీ సన్యాసాశ్రమాన్ని స్వీకరించాక రంగురంగుల పీలికలను కలిపికట్టుకునేవారు. ఆయన భిక్షను స్వీకరించే మట్టి పాత్ర (మరాఠీలో గాడ్గే) తలపై పెట్టుకుని తిరుగుతుండటంతో ఆయనను గాడ్గే బాబాగానూ, గాడ్గే మహరాజ్‌గానూ పిలిచేవారు.

గాడ్గే బాబా ఆధ్యాత్మిక విషయాలను బోధించడంతో పాటుగా సాంఘిక సమస్యల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేసేవారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం, దాహంతో అలమటిస్తున్నవారికి నీరు, దుస్తులు లేనివారికి వస్త్రాలు, పేదలకు నాణ్యమైన విద్య, రోగులకు వైద్యం, తలదాచుకునేందుకు నివాసం, జంతువులకు రక్షణ, నిరుద్యోగులకు ఉపాధి, నిస్సహాయులకు ఆలంబన, పేద యువతీయువకులకు వివాహం జరగాలని ఆశించి, అందుకోసం జీవితమంతా కృషిచేశారు. భక్తులను ప్రోత్సహించి, వారి విరాళాలతో మహారాష్ట్ర వ్యాప్తంగా 150 పాఠశాలలు, ధర్మశాలలు, శరణాలయాలు, గోశాలలు, ఆస్పత్రులు, విద్యార్థినుల వసతి గృహాలు నిర్మించారు. వందలాది సేవాసంస్థలను, ట్రస్టులను నిర్మించిన బాబా తన కుటుంబ సభ్యులను, బంధువులను ఆయా ట్రస్టుల్లోని పదవుల్లో నియమించకుండా సేవాభిలాష ఉన్న సహచరులనే ఎంపికచేసి నియమించడం విశేషం. సంచార సన్యాసిగా ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామంలోని మురికిని, చెత్తను చీపురుతో శుభ్రపరిచేవారు. ఆయన పరిశుభ్రతకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా పేరు పొందారు.

బాబా కులవివక్షను, కులతత్వాన్నీ తీవ్రంగా వ్యతిరేకించేవారు. పండరిపూర్‌లో స్వామివారి ఉత్సవాలు వర్షాకాలంలో జరిగేవి. ఈ ఉత్సవాలలో పాల్గొనేందుకు దూరతీరాల నుంచి వచ్చి పాల్గొనే భక్తులతో క్షేత్రమంతా కిక్కిరిసిపోయేది. అప్పట్లో ఆలయ ప్రవేశార్హత లేక కేవలం ఆలయంపై ఉండే కలశాన్ని చూసేందుకు వచ్చి దర్శనం చేసుకుని వెళ్లే దళిత కులస్థుల ఇక్కట్లు మరీ ఎక్కువగా ఉండేవి. వారి ఇబ్బందులను గమనించిన గాడ్గే బాబా భక్తులు, ప్రజల సహకారాలను అర్థించి అక్కడ చొక్క మేళా పేరుతో ఓ ధర్మశాల నిర్మించారు. దళిత భక్తుల కోసం కట్టించిన తొలి ధర్మశాలగా ఇది ప్రఖ్యాతి పొందింది. సమాజం నుంచే కాకుండా అత్యంత సన్నిహితుల నుంచి కూడా దూరమై దారుణమైన వివక్షను అనుభవిస్తున్న కుష్ఠురోగులకు సేవచేసేందుకు గాడ్గే బాబా వారికి సేవాశాలలు నిర్మించి, సేవా కార్యకలాపాలు చేపట్టారు.

1876 ఫిబ్రవరి 23న జన్మ